

# త్రిభుజం

శ్రీధర

ఆ రోజంతా దేవసేనకు ఒకటే బోరుగా ఉంది. గడియారం మరీ నత్తనడక నడుస్తున్నట్లే ఉంది.

స్వరూప్ ఆఫీసులో ఉంటే క్షణం తీరుబడి ఉండేదికాదు. నిముషనిముషానికి తన గదిలోకి పిలుస్తూనే ఉండేవాడు. ఏదో పని అప్పగిస్తూనే ఉండేవాడు. అంత ఊపిరిసలుపని పనిచేసినా, ఏమంత కష్టంగా ఉండదు. బహుశా అందుకు స్వరూప్ చాలావరకు కారణం కావచ్చు.

అతను క్యాంప్‌నుంచి వచ్చేదాకా ఇంతే. తీరుబడిగా కూర్చుని పత్రికలు చదువుకోవటమే. దేవసేనకు ఆ చెత్త పుస్తకాలు చదవటమంటేనే గిట్టదు. ఒకసారి తిరగేసి అవతల పారేస్తుంది. అంతే_ బొమ్మలు చూస్తే చదివేసినట్లే లెక్క. అంతకన్నా మనుష్యుల్ని చదవటం అంటేనే దేవసేనకు ఎంతో ఇష్టం. ఆ విద్యలో అందెవేసిన చెయ్యి ఆమె. మొదటిసారి దారుణంగా ఓడిపోతే ఓడిపోయింది గాక. కానీ ఆ అనుభవం ఆమెకు చాలా ఉపయోగపడుతోంది. అందర్నీ అంతదూరంలో ఉంచి మాట్లాడుతోంది.

స్వరూప్ విషయం వేరు. అతనికి దగ్గరగావెళ్లటం మొదట వృత్తిరీత్యాను, తర్వాత ఆసక్తి రీత్యాను, అనివార్యమైంది. చివరకిప్పుడు అతను ఒక్క రోజు దూరమైతే బోర్‌గా ఉంది. కాలం కదలనంటోంది. కాళ్లూ చేతుల్ని ఎవరో

కట్టేసినట్లు, బ్రతుకే నిస్తేజమైనట్లు.... ఈ అనుభూతి గుండెల్లోని ఒంటరితనం నింపిన బరువు ఒకరికి చెబితే అర్థమయ్యేదికాదు.

నిజానికి ఒంటరితనం తనకు కొత్త కాదు. ఇన్నిలక్షలమంది మధ్య మసులుతున్నా, యంత్రంలా ఉదయంనుంచి సాయంత్రందాకాఅందరితోమాట్లాడుతూ, చిరునవ్వులు చిందిస్తూ సమాధానాలు చెప్పి పంపిస్తున్నా, తాను ఏకాకి– ఆ మాటకొస్తే, కాకులైనా ఒకదానితో మరొకటి కల్పి చెట్టునీడన, తోడు చూసుకుంటాయేమోగానీ, తనకు ఆ భాగ్యమూ లేదు.

పాలుపంచుకునేవాళ్లంటూ ఎవళ్లయినా ఉంటే, ఎంతటి దారిద్ర్యాన్నయినా, సంతోషంగా అనుభవించవచ్చు. ఒంటరితనం అనే శిక్షను అనుభవించటాన్ని మించిన శాపం మరొకటిలేదేమో.

ఈ ఆఫీసులో చాలామంది ఉన్నారు. వాళ్లందరితోనూ తనకు పరిచయం ఉంది. అయినా, ఇలా ఖాళీగా ఉన్నప్పుడైనా ఎవరూ తనదగ్గరకు రారు. తనూ వెళ్లదు– అందులో సిల్లీగా ఫీల్అవటానికి కారణం ఏమీలేదు. స్వరూప్, తనతో చాలా చనువుగా ఉంటాడు. ఇద్దరి మధ్యా ఆ చనువు బాగా పెరిగింది. అతన్ని చూడకపోతే ఏమిటో ఇదిగా ఉంటోంది. ఇంక స్వరూప్ సంగతి అయితే చెప్పనక్కర్లేదు.

నిలువెత్తు మనిషి. నిండు సూట్‌లో దర్జాగా, రాజెవడికొడుకు అన్నంత ధీమాగా ఉంటాడు. స్టీరింగ్ ముందు కూర్చున్నా, రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చున్నా, గార్డెన్ చెట్టుక్రింద కూర్చున్నా, బీచ్‌లో తన వొడిలో పడుకున్నా అతని గెటప్ ఇంకెవరికీరాదు.

తనగూర్చి అతనూ అలాగే అంటాడు. ఆ మాటలు ఎప్పుడూ చెవిలో మారుమ్రోగుతూనే ఉంటాయి–

'పొద్దునలేస్తే ఎంతమంది ఆడవాళ్లను చూడంలేదు? తలతిప్పి రెండోసారి చూడాలనిపించేవాళ్లు ఎంతమంది అంటారు? నీ సంగతి వేరు. చుట్టూ ఎంతమంది ఉన్నా, నీ మీదనుంచి చూపు మరల్చుకోవటం నాకు చేతకాదు....'

వయసులోని ఆడదాని అందాన్ని గూర్చి ఒక మగవాడు మెచ్చుకున్నాడంటే, కనీసం మానసికంగానైనా ఆమె అతనివైపు ఆకర్షించబడుతుంది. అందునా, స్వరూప్‌లాంటి సౌమ్యుడు, అందగాడు అయస్కాంతంలా ఆకర్షిస్తుంటే, వరద వెల్లువలా వచ్చి చుట్టుముట్టేస్తుంటే, అతని ప్రేమప్రవాహంలో కొట్టుకుపోతున్న తనకు, ఈ ఆఫీసులోని మిగిలినవాళ్లు వెనకనుంచి గొణుక్కునేవేమీ వినిపించటం లేదు.... కేరే హూట్ ఫర్ దెమ్.

"నేనంటే నీకెందుకింత ఇష్టం?" అడిగిందొకసారి, బీచ్‌లో.

"నాకు తెలిస్తేనా, నీకు చెప్పటానికి? అవునుగాని, ఆ పున్నమి చంద్రుణ్ణి చూస్తే, ఈ కెరటాలకెందుకింత అలజడి? ఈ వెన్నెలను చూస్తే, ప్రకృతికెందుకింత పరవశం? నీకు తెలిస్తే చెప్పవా," అని అడిగాడు.

"ఏమో బాబూ, నాకు తెలీదు" అంది చిరునవ్వుతో, సిగ్గుతో.

"ఈ వెన్నెలమీద, చల్లగాలిమీదా నాకు అంతులేని కోపం, దేవీ.... ఇట్టే వచ్చి అట్టే వెళ్లిపోతాయి. కానీ నీ కన్నుల కురిసే వెన్నెల, నీ పెదవుల మెరిసే మందహాసం నాకెంత తృప్తినిస్తాయో, మరెంతగా సేద తీరుస్తాయో, నీకు చెప్పలేను కూడా.... ఇవి నాకెప్పటికీ కావాలి.... నువ్వు నాకు ఎప్పుడూ కావాలి...."

"కానీ...."

"మధురమైన సంగీతం వినేటప్పుడు అపశృతులు వినిపించకురా...." అన్నాడు స్వరూప్, తన గుండెలమీద వాలిపోయి....

స్వప్నం సుందరమైనదే కావచ్చు. అయినా అది స్వప్నమే కదా.... ప్రకృతి ధర్మం మళ్ళీ మనల్ని ప్రస్తుతంలోకి లాక్కొచ్చి పడేస్తుంది కదా.

అందుకనే స్వరూప్‌ను ఒకరోజు టీకి పిల్చింది.

"ఏమిటి ఏదో మాట్లాడలన్నావు?" అతనే కదిలించాడు.

"మరేంలేదు. మీకో విషయం చెప్పాలని...."

"చెప్పు. సందేహం ఎందుకు?"

"ఏం లేదు, నాకు ఇదివరకొకసారి పెళ్లయింది...."

కొద్ది క్షణాలు ఆలోచనలో పడి నెమ్మదిగా అన్నాడు. "అలాగా.... నాకూ పెళ్లయింది..." ఆమె మెడవంక పరీక్షగా చూసాడప్పుడు.

"అయితే నేను నా భర్తకు విడాకులిచ్చాను...." అన్నది తల దించుకుని.

"అయితే నేనూ నా భార్యకు విడాకులిస్తాను...." అన్నాడతను కిటికీలో నుంచి బయటకు చూస్తూ.

"నేను విడాకులివ్వటానికి కారణం ఉంది...."

"నాకూ కారణం ఉంటుంది" గొణుక్కున్నాడు.

"పెద్దవాళ్లు ఏరికోరి తెచ్చిన సంబంధం. బోలెడంత ఖర్చు పెట్టి ఘనంగా పెళ్లిచేశారు. నేను కూడా వంచిన తల ఎత్తకుండా తాళి కట్టించుకుని ఆయన చిటికినవేలు పట్టుకుని ప్రదక్షిణాలు చేశాను. ముందుగా మనకేం తెలుస్తుంది? అందరిలానే ఉంటే, అందరిలా మంచివాడనే అనుకుంటాం కదా మొదటిరోజు గదిలోకి వెళ్లాక తెల్సొచ్చింది. నరకం అంటే ఏమిటో....దాన్ని దాంపత్య సుఖం అని అందరూ అంటారు. కానీ వాడు....

కారికి, రక్కీ- మీరు మగవారు, నేను ఆడదాన్ని కాబట్టి, అక్కడేం జరిగిందో స్పష్టంగా చెప్పలేకపోతున్నాను. వాడొక శాడిస్టు. రోజూ నా ప్రాణం తీసేవాడు. కాలే సిగరెట్టు పీకతో నా తొడలమీద కాల్చేవాడు. జుట్టు పట్టుకుని పీకేవాడు. గిల్లేవాడు. గిచ్చేవాడు. తన్నేవాడు.... సాయంత్రమవుతోందంటే, ఆ యముడు ఇంటికొస్తున్నాడంటే నాగుండెల్లో రైళ్లు పరుగెత్తేవి. ఒంట్లో బాగోలేదంటే, బెల్టు తీసుకుని కొట్టేవాడు. ఆ మచ్చలు నా ఒంటిమీద, ఆ భయాలు నా మనసుమీదా ఇంకా అలాగే ఉన్నాయి.... ఆ రోజు గుర్తుకొస్తే గజగజా, పండుటాకులా వణికిపోతాను..."

ఏడ్చేసింది. స్వరూప్ దగ్గరకొచ్చి జేబులోంచి కర్ఛీఫ్ తీసి కన్నీరు తుడిచాడు. ఆచ్ఛాదనం లేని పచ్చని జబ్బల మీద రెండుచేతులూ వేసి తలను కొద్దిగా వంచి, మృదువుగా మెడపక్కన ముద్దు పెట్టుకున్నాడు.

"ఫర్ గెటిట్...." అన్నాడు.

"పెళ్ళంటేనే భయం.మగవాళ్ళంటేనే అసహ్యం...." చెమ్మగిల్లిన కళ్ళతోనే ఉబికొస్తున్న దుఃఖంతోనే అన్నది.

"నేను అన్నా అసహ్యమేనా?" ఎడమచేత్తో వెన్నెముకమీద రాస్తూ అడిగాడు.

"అఫ్‌కోర్స్ ... నో...." అంది కన్నీళ్లు తుడిచేసుకుని.

"థాంక్యూ...." అని అస్పష్టంగా ఆమె చెవిలో అన్నాడు.

ఒకసారి తనతో క్యాంపుకు తీసుకు వెళ్లాడు. కారులో వస్తూ ఒకచోట ఆగి గెస్ట్‌హౌస్‌లో ఆ రాత్రికి బసచేశారు. స్నానాలు చేసి ఆరుబయట కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. అతనికి నచ్చిన పాటలన్నీ టేపుచేసుకున్నాడు.ఆ పాటలు వింటూ కూర్చుంది తను. కాసేపటికి భోజనాల టైమైంది. పాటలు ఆపేసి

మరొకరు శాసించిన మార్గాన వెళ్లి మంచిని తెలుసుకోవడం కంటే. ఎవరికి నచ్చిన త్రోవను వారు వెళ్లి చెడుని తెల్సుకోవడమే శ్రేయస్సు. (డాస్టోవిస్కీ)




లేచింది.

"నీకు అభ్యంతరం లేకపోతే, నేను కాసేపు ఇక్కడే కూర్చుని డ్రింకు తీసుకుంటాను" అన్నాడు స్వరూప్.

అతను తాగుతాడని తెలియటం మొదటిసారి కాబట్టి కొంచెం ఆశ్చర్యపోయింది. అయినా తను తనను పర్మిషను అడగవల్సిన పనేముందసలు?

ముందే చెప్పినట్లున్నాడు, వాచ్‌మన్ అన్నీ సర్దేసి వెళ్లాడు. అతను ఒక గ్లాసు ఖాళీచేసేదాకా అలాగే చూస్తూకూర్చుంది. తాగాక ఎలా ఉంటారు, ఎలా ప్రవర్తిస్తారు? తాగినవాళ్ల గురించి వింత వింతగా చెప్పుకుంటారు. ఇతనూ అలాగే వేషాలేసి, తెల్లారి లేచాక క్షమాపణలు చెప్పుకుంటాడా? అతీరు చూస్తుంటే, బాగా అలవాటున్నవాడిలాగే ఉన్నాడు తప్ప, దీనికి కొత్త దాసులా లేడు.

"నాకో చిన్న అనుమానం, మీరిలా తాగటం మీ ఆవిడకు ఇష్టమేనా?" అని అడిగింది తను కాసేపటికి.

చిన్నగా నవ్వేడు. సిగరెట్టు మసి విదిల్చి మళ్ళీ పొగ పీల్చి వదులుతున్నాడు "ఆవిడ సంగతి సరే, నీకు ఇష్టం లేనట్లుంది...."

"మీకు అనేక అలవాట్లు ఉండొచ్చు నేనిప్పుడు కాదనవద్దను కదాని, ఇన్నేళ్ళ మీ అలవాట్లనూ, సరదాలనూ మార్చుకోమనీ, మానుకోమనీ ఎలా అడుగుతాను?"

"అది నీ సంస్కారాన్ని సూచిస్తోంది. కానీ ఇదే మా ఆవిడ అయితే మూడో ప్రపంచ యుద్ధాన్ని ప్రారంభించేది." అన్నాడు.

"అంత ద్వేషమా?" ఆశ్చర్యంగా చూసింది.

"అసలు అదొక పల్లెటూరి బైతు, సంస్కారం, సభ్యత తెలియవు. చుట్టూ ఉన్న సమాజం శరవేగంతో మారిపోతుంటే, తాను మాత్రం ససేమిరా మారను పొమ్మనే అమ్మమ్మ లాంటిది. ఆ మనిషి సైకాలజీ చాలా చిత్రమైనది, నేను అందంగా ఉంటానని, డబ్బు, హోదా అన్నీ అందుబాటులో ఉన్నాయని లోపల ఏడుపు...."

"అదేమిటి? తన భర్తకు అవన్నీ కావాలని ప్రతి భార్యా కోరుకుంటుంది

గాని, అవన్నీ ఉన్నాయని ఎందుకేడుస్తుంది...."

"అన్నీ ఉన్నవాడికి మిగిలిన అవలక్షణాలుండవా అని దాని అనుమానం. బయట ఎంతోమందితో తిరిగి తిరిగి ఇల్లు చేరుకుంటానని ఆడిపోసుకుంటుంది. సూటిపోటి మాటలతో ఎప్పుడూ నాకు మనశ్శాంతి లేకుండా చేస్తుంది. కానీ దేవసేనా నువ్వు తప్ప, నాకు మరే స్త్రీతోనూ పరిచయం లేదు. ఈ పరిచయానికైనా దానివేధింపే కారణం. ఇంట్లో కరువైన మనశ్శాంతిని ఆఫీసులో, నీలో వెతుక్కున్నాను. తప్పంటావా?"

ఏమని చెబుతుంది? నిట్టూర్చింది. "నేను శారీరక హింసకు గురిఅయితే మీరు మానసిక హింసకు గురిఅయ్యారన్నమాట...." అంది దేవసేన.

"నీలాగా నేను విడాకులు తీసుకుంటున్నాను. వీలైనంత త్వరలోనే మేం విడిపోతాం, మనం కలిసిపోతాం.."

సీసా పూర్తయింది. తాగటమూ అయిపోయింది. అయినా మనిషిలోగాని మాటలో గాని ఎలాంటి మార్పూ లేదు. పక్కన కూర్చుని సావధానంగా భోంచేశాడు. ఇంకో గంటసేపు అలాగే వెన్నెల్లో కూర్చున్నారు.

"తాగినవాళ్లు నానా అల్లరి చేస్తారంటారు. మీరు మామూలుగానే ఉన్నారే?" అని అడిగింది దేవసేన చివరకు.

"అది తాగుడులో లేదు. వాళ్ల స్వభావంలో ఉంది. అలా అల్లరిచేయటం కోసమే తాగుతారు...."

మళ్లీ స్వరూప్‌భార్య ప్రస్తావన తెచ్చింది. ఏవేవో చెప్పుకొచ్చాడు ఆమెకి. అందంలేదు, ఆస్తిలేదు, చదువులేదు. అయినా అహంభావం ఉంది అంతులేని గర్వం. వల్లమాలిన కోపం. ఆమె సుఖంగా బతకదు. ఎదుటివాళ్లను బతకనివ్వదు. అదీ సారాంశం.

గదిలో పడుకునేటప్పుడు లైటు ఆర్పేస్తూ అన్నాడు. "నీకు మళ్లీ పెళ్లి అన్నా, మగవాళ్లు అన్నా భయంపోలేదని చెప్పిన విషయం నేను మర్చిపోలేదు. కానీ నీకు ఇష్టమై నాదగ్గరకు వచ్చేవరకు నేను తొందరపడను. ఎన్నేళ్లయినా ఫర్వాలేదు...."

ఆ మాటలతో దేవసేనకు స్వరూప్ మీద అంతులేని అభిమానం పెరిగిపోయింది. ఇప్పటికైనా అతని అండ దొరకటం అదృష్టంగా భావించింది

ఈ సారి క్యాంపుకు కూడా తనను తీసుకుని వెళ్తాను రమ్మన్నాడు. కానీ ప్రతిసారి వెళ్తే బాగుండదని తనేరానంది. పైగా ఆయనగారి భార్యకు ఈ విషయం తెలిస్తే, అప్పడాల కర్రతో ఆఫీసుకొచ్చి తనమీద దండయాత్ర చేసినా చెయ్యవచ్చు ఎందుకో ఆమెను ఒక్కసారి చూడాలన్న కోరిక దేవసేనకు చాలా రోజులనుంచి ఉంది. ఆమెను ఎక్కడికీ బయటకు తీసుకురాడు. ఆయన ఇంటికివెళ్లే అవసరం ఇంతవరకూ కలగలేదు. ఇప్పుడా అవకాశం దొరికింది, మరి?

దేవసేన బయల్దేరబోతుండగా, పోస్టువాడు టెలిగ్రాం పట్టుకొచ్చి ఇచ్చాడు. స్వరూప్‌కు కలకత్తా నుంచి వచ్చింది. పదవ తారీఖు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నాం. సికింద్రాబాద్‌లో రిసీవ్ చేసుకోమని ఉన్నది అందులో.

ఏం చెయ్యటమా అని ఆలోచించింది. స్వరూప్ ఎప్పుడొస్తాడో ఖచ్చితంగా తెలియదు. కనుక టెలిగ్రాం ఇంటికి పంపాలి. తనే తీసుకెళ్తే ఒక్కసారి ఆమెను చూసినట్లూ ఉంటుంది.

ఇంకా వాళ్ల వ్యవహారం విడాకుల దగ్గరే ఉంది. కాబట్టి తమ ప్రేమ వ్యవహారం ఆమెకు తెలిసే అవకాశం లేదు. ఆ ఆలోచన వచ్చాక ఆమెకు కొండంత ధైర్యమూ వచ్చింది. గబగబా సీటు సర్దేసి, బయటకొచ్చి ఆటో ఎక్కింది. పావుగంట తర్వాత వాళ్ళింటి గుమ్మంముందు దిగింది. నేమ్ ప్లేటు చూసుకుని, కాలింగ్ బెల్ నొక్కింది. రెండు నిమిషాల తర్వాత ఆమె తలుపు తీసి, ఎవరు కావాలన్నట్టు చూసింది. "నేను... స్వరూప్‌గారి ఆఫీసులో పని చేస్తున్నాను...." అంది.

"అలాగా.... లోపలికి రామ్మా..." అని సాదరంగా ఆహ్వానించింది.

దేవసేన లోపలికి వెళ్లింది సోఫాలో కూర్చోమంటే కూర్చుంది. ఎదురుగా ఆమె కూడా కూర్చుంది. దేవసేన హాండ్‌బ్యాగ్ తెరచి టెలిగ్రాం తీసి ఇచ్చింది. ఇంగ్లీషులో ఏముందో చదివి అర్థంచెప్పమంటుందని ఆశించింది దేవసేన. కానీ అలాంటిదేమీ జరగలేదు. తనే చదువుకుని, మడిచేసి పక్కన పెట్టింది.

"మైసిస్టర్ ఈజ్ కమింగ్ టుమారో. .... అవునూ దీనికోసం ఇంత దూరం శ్రమపడివచ్చారా? ఫోన్ చెయ్యలేకపోయ్యారా?" అన్నదామె.

"శ్రమలేదండి. నేను ఇటువైపే వెళ్తున్నాను. దారిలోనే గదాని ...."

"ఐసీ, దెన్ ఇట్సాల్‌రైట్ ..."

దేవసేన ఇల్లంతా తేరిపార చూడటం గమనించి ఆమె లేచింది.

"రండి, ఇల్లు చూద్దురుగాని" అని అన్ని గదులు చూపించింది. ఆ ఇంట్లోని ఒక్కో వస్తువు ఎప్పుడెప్పుడు తాను ఎంత గొడవ పెట్టి కొనిపించిందీ సరదాగా జోక్‌చేస్తూ చెప్పింది.

బెడ్‌రూం ముందరకొచ్చాక లోపలికి వెళ్ళటానికి సందేహించిన దేవసేనతో ఆమె అంది. "ఫర్వాలేదు, రామ్మా. ఇది నీ ఇల్లే అనుకో".

అతి మామూలుగానే అన్నప్పటికీ అందులో గూఢార్థం ఏమైనా ఉందేమోనని దేవసేన ఉలిక్కిపడింది.

"ఇది మీ బాస్ బెడ్‌రూం...."

"అదేమిటి, మీది మాత్రం కాదా?" అని నవ్వు తెచ్చుకుని ప్రశ్నించింది.

"ఈ ఇంట్లో నాదంటూ ఏదీ లేదు. అంతా ఆయన ఆస్తియే...."

"ఆయన ఆస్తి మీ ఆస్తి కాదా?

"ఆడదానికి అస్తిత్వం అంటూ ఉంటేకదా, ఆస్తి ఉండటానికి .... నీ లాంటి ఏ కొద్దిమందో తప్ప, నాలాంటి అధిక సంఖ్యాకు లంతా పరాధీనులే కదా...."

వంటింట్లోకి వచ్చాక, దేవసేన డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటే, ఆమె ఫ్రిజ్‌లో నుంచి కూల్ డ్రింక్ తీసి ఇచ్చింది.

"వద్దండీ ..." అంది మొహమాటంగా.

"అదేంటమ్మా, నేను నీకు పరాయి దాన్ని కాదు. వరసకు అక్కనవుతాను. నీకు అభ్యంతరం లేకపోతే, నిన్ను చెల్లీ అని పిలుస్తాను, దేవసేనా?" అంది పక్కన కూర్చుని.

ఈ మాటలతో దేవసేనకు అర్థమైపోయింది. ఆమెకు అంతా తెల్సు. తెల్సీ తనను ఏమాత్రం ఏవగించటం లేదా?


తడారిపోయిన గొంతును పెగల్చుకుని అడిగింది. "ఏమండీ, మీకు అంతా తెల్సు గదూ.... ఇంక దాచొద్దు. నిజం చెప్పండి.... మీకు ఎవరు చెప్పారు మా సంగతి?"



ఆమె కొద్దిక్షణాలు మౌనంగా ఆలోచించి చెప్పింది. "ప్రతి మనిషికీ పదిమందికీ గర్వంగా చెప్పుకోదగ్గ విషయాలు కొన్ని ఉంటాయి. సన్నిహితులకు మాత్రమే చెప్పుకోదగ్గ విషయాలు కొన్ని ఉంటాయి. భార్యకు మాత్రమే తెలియజెప్పేవి ఇంకొన్ని ఉంటాయి. భార్యకుకూడా చెప్పకూడని రహస్యాలూ ఉంటాయి. వీటిల్లో ఒకరికి తెలియగూడని విషయాలు మరొకరికి తెలిస్తే అనేక కష్టాలు ఎదురవుతాయి. అలాంటిది ఎవ్వరికీ తెలియగూడని ప్రేమవ్యవహారాలు ముందుగా అందరికీ తెల్సిపోతుంటాయి. తర్వాత ఎప్పుడోగాని అసలువాళ్ళకు తెలియదు. మీ విషయంలోనూ అంతే జరిగింది. ఎవరో బయటివాళ్ళు నా చెవిని వేశారు...."

ధైర్యసాహసాలు ఏ కొందరి సొత్తు మాత్రం కాదు, ప్రతివారిలోను ఈ లక్షణాలు అంతర్గతంగా ఉంటాయి. లోపం అల్లా వాటిని ఆచరణలోకి తేకపోవడమే

(మహాత్ముని సూక్తి)




"మీ గురించి ఆయన నాకు ఇంకో రకంగా చెప్పారు. మీకు చదువు రాద న్నాడు" అని ఒక్కొక్క సందేహమే విప్పుత్తి చేసుకోసాగింది.

"నిజమే. ఆయనంత చదువుకోలేదు. ఆయన మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ గదా....."

"మీరు చిన్న పల్లెటూరినుంచి వచ్చారని...."

"అదీ నిజమే...."

"వాళ్ళది పెద్ద పల్లెటూరు, మాది చిన్న పల్లెటూరు...."

"మీరు ఏమీ అందంగా ఉండరని.."

"నిజమే, ఇప్పుడు ఆ య న కు అందంగా కనిపించటంలేదు."

"మీకు కోపం ఎక్కువనీ, ఎప్పుడూ సాధిస్తుంటారని...."

"ఆయన మనసు నీమీద లగ్నమై ఉన్నప్పుడు, నేను అడ్డుగా ఉండటమే కోపకారణం అవుతుంది, పలకరించటమే సాధింపుగా ఉంటుంది, చెల్లీ...."

"మిమ్మల్ని కూడా ఆయన ఒక ప్పుడు ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడని, కానీ తర్వాత నిరాశపొందానని చెప్పా రాయన...."

"కావచ్చు. ఈ ప్రేమ, పెళ్లి అనేవి ఆడదానికి ఒకరకంగాను, మగవాడికి మరోరకంగాను కనిపిస్తాయి. పెళ్లిచేసుకున్న ఆడది జీవితాంతం ఆ గడప లోపలే ఆగిపోయి, అక్కడే తనకు కావల్సిన ప్రేమకోసం వెతుక్కుంటుంది. కానీ మగవాడు అనేక వ్యాపకాలతో బయటకు వెళ్తాడు కదా. దేని దగ్గర పడితే దాని దగ్గర ఆగిపోతాడా, ఎప్పటికోగాని ఇల్లాలు గుర్తుకు రాదు, భర్త తిరిగి తిరిగి ఆమె దగ్గర కొచ్చేటప్పటికి చాలా ఆలస్యమైపోతుంది. ఆమెకు కళ్లు మూతలుపడుతుంటాయి...."

"ఎందుకని ఇలా జరుగుతోంది?"

"స్త్రీ సౌందర్యానికి ప్రతీక. పురుషుడు షట్టటమే సౌందర్య పిపాసిగా పుట్టాడు. అంచేత అతని ఈ సౌందర్యాన్వేషణ వార్ధక్యం ముంచుకొచ్చే దాకా కొనసాగుతూనే ఉంటుంది. పరిచయమున్న ప్రతి స్త్రీ పక్కనా అతను కామాలే పెడుతుంటాడు గాని, ఫుల్ స్టాప్ లు పెట్టడు...." అంది కుమేల్

(డ్రింక్) పోసాను ఈసారి దేవసేన చేతికి అందించి.

"స్వరూప్ కూడా అంతేనంటారా?" కొద్దిగా సిప్ చేసి అడిగింది దేవసేన.

"ఇలాంటి విషయాలు ఎవరుచెప్పినా నమ్మకం కుదరదు. అనుభవం ఒక్కటే నమ్మించగలదు .. "

"ఇంతదాకా వచ్చింది కాబట్టి ఇంకా దాచుతెర లెందుకు? ఆయన మీకు విడాకు లిస్తున్నారట గదా? .. "

"అవును.. "

"తర్వాత మీ జీవనం?"

"ఆయన యిచ్చే మనోవర్తి మీద నేను ఆధారపడను."

"ఏదైనా ఉద్యోగం చేస్తారా?"

"చెయ్యవచ్చు, చెయ్యకపోవచ్చు."

"....పోనీ.... మీరుకూడా.... మళ్లీ పెళ్లి....?"

"నాలాంటివానికి ఒకసారి పెళ్లిచేసుకుని ఒక మొగుడ్ని పొందటమే పెద్ద లగ్జరీ. ఇంక రెండో పెళ్లి, మూడో పెళ్లికూడానా....అన్నిపనులూ అందరూ చెయ్యలేరు, చెల్లీ...." అంది ఎంతో సౌమ్యంగా నవ్వుతూ.

కానీ ఆ మాటలతో దేవసేన చెంప మీద ఛెళ్ళుమని కొట్టినట్లు ఉంది. నిజంగా చాచిపెట్టికొట్టినా అంతగా బాధ పడకపోను.

ఇంక ఉండలేకపోయింది. లేచింది. ముందుగదిలోకి వచ్చింది.

"ఆయన వస్తే, నువ్వు వచ్చివెళ్ళావని చెప్పమంటావా?"

"ఆ, మీ సెక్రటరీ వచ్చి వెళ్ళిందని చెప్పండి...."

"అహా, మీ ట్రెజరర్ వచ్చి వెళ్లిందని చెప్తాను."

"అదేమిటి?" ఆశ్చర్యంగా అడిగింది

"భర్తల డబ్బునంతా దగ్గర పెట్టుకుని ఖర్చు పెట్టేది భార్యేగదా. అందుకని

ట్రెజరర్ అనటమే బావుంటుంది....”

“కానీ నేను ఆయన డబ్బును ఆశించటంలేదు....”

“అని నేను అనలేదే.... ఆయన దగ్గర డబ్బు ఉందికదా. దాన్ని మనం కాదనలేం.”

ఈ అవమానభారమూ దేవసేనకు భరింపరానిదే అయింది. ఇంతకన్నా డబ్బుకోసం వెంటపడ్డ వంచకిని– అని స్పష్టంగా చెప్పినా బాగుండేది.

శలవు తీసుకుని బయటకు వచ్చింది. ఆమె మనసునిండా ఆలోచనలు కందిరీగల్లా కుట్టి బాధపెట్టేస్తున్నాయి.

ఎంత మెత్తని చెప్పుతో కొట్టింది? ఎంతలౌక్యంగా దెబ్బతీసింది? ఈమెనా స్వరూప్ అంత క్రూరంగా, కర్కశంగా చిత్రీకరించాడు. అతను చెప్పినదానికీ తాను చూసినదానికీ ఎక్కడా పోలికే లేదు.

తనెవరో తెల్సి, అంత సహనాన్నీ చిరునవ్వునీ చూపి, ఏమాత్రం ఉద్రేకపడకుండా, ఎవరో మరొకరి విషయం అన్నంత తాపీగా సమాధానాలు చెప్పింది.

అంతేకాదు తనను పూర్తిగా ఓడించింది.

ఆమె చాలా తెలివికలది. తన సంసారాన్ని కాపాడుకునే పద్ధతి ఆమెకు తెల్సు. అది తెలియని స్వరూప్ తప్పటడుగువేశాడు. బహుశా తనకు దగ్గరవటం కోసమే, ఆమెకు దూరమవుతున్నాడేమో! అదే నిజమైతే స్వరూప్ చాలా పెద్ద తప్పుచేస్తున్నాడు. తనవల్ల ఒక సంసారం నాశనంకాకూడదు. అందునా ఆమెలాంటి ఉత్తమ ఇల్లాలి ఉసురు తగలకూడదు.

అవును! స్వరూప్ రాగానే చెప్పేస్తుంది. తను మనస్సు మార్చుకున్నట్లు స్పష్టంగా చెప్పేస్తుంది....

ఈ నిర్ణయాని కొచ్చాక దేవసేన మనసు కుదుటపడింది. ఆఫీసులో అడుగుపెడుతూ కూడా మనసు దిటవు చేసుకుంది. స్వరూప్ ఎంత ప్రలోభపెట్టినా లొంగకూడదు. ఇంక ఆయన దగ్గర తను ఎక్కువరోజులు పనిచెయ్యలేదు. రెండు, మూడురోజుల్లో రాజీనామా ఇచ్చేస్తుంది. తర్వాత ఏంజరుగుతుందో అంతా దేవుడిదే భారం.

సంతకం పెట్టి సీట్లో కూర్చోగానే, పిడుగులాంటి వార్త విన్నది. స్వరూప్ క్యాంపునుండి వస్తుంటే యాక్సిడెంట్ అయిందట. ఉస్మానియాలో పేయింగ్ రూమ్‌లో ఉన్నాట్ట. అప్పుడే ఆఫీసులో ఈ విషయం చాలామందికి తెల్సిపోయింది. అందరూ చూసి వచ్చేశారు.

దేవసేన కూడా వెళ్లింది. ఎడమ చెయ్యి సగానికి తెగిపోయింది. కాలికి కూడా పెద్ద దెబ్బ తగిలింది! కట్లు కట్టుకుని చూడడానికి భయంకరంగాఉన్నాడు. స్టూలు దగ్గరకు లాక్కుని కూర్చుంది.

అతని కళ్లవెంట కన్నీరు చూడటం అదే మొదటిసారి.

“ఇలా అయిపోయినాను దేవసేనా?” అన్నాడు.

“ఫర్వాలేదు. తగ్గిపోతుంది. మరిప్పుడు ధైర్యంగా ఉండాలి” అన్నది, దేవసేనకూడా దుఃఖాన్ని గొంతులో దాచుకునే ప్రయత్నంచేస్తూ.

స్వరూప్ ఏదో చెప్పాలని అనుకుంటూ చెప్పలేకపోతున్నాడు. అసలే జీవితంలో ఒకసారి దెబ్బతిన్న దేవసేన ఇలా అవిటివాడైపోయిన తనను కట్టుకుని ఏం బావుకుంటుంది? ఆమె తనను చేసుకోకూడదు అని అతను అనుకుంటున్న సమయంలోనే–

దేవసేన ఇలా అనుకుంటోంది—

దేవతలాంటి స్వరూప్ భార్యను నిన్న చూశాక, వాళ్లమధ్యకు వచ్చి తనెంత పాపంచేస్తోందో తెల్సుకుంది. దూరంకావటానికే నిశ్చయించుకుంది. కానీ, ఈ పరిస్థితుల్లో ఆ నిర్ణయానికి వేరే అర్థంవస్తుంది కదా. అతడు అవిటివాడైపోయాడు కాబట్టే, తన మనసు మార్చుకున్నట్లు ఆమె అనుకుంటుంది.

స్వరూప్ భార్య ఫ్లాస్కులోని కాఫీ రెండు కప్పుల్లోపోసి ఇద్దరికీ అందించింది. కిటికీదగ్గరకు వెళ్లి నిలబడి బయటికి చూస్తోంది.

ఆమె మనసులో ఏముందో, వీళ్లకు తెలియదు. అడిగినా చెప్పదు. కానీ త్రిభుజంలోని రెండు భుజాల కొలతలు తెలిస్తే, మూడో భుజం సంగతేమిటో తెల్సుకోవటం ఏమంత కష్టంకాదు.

